క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



విజయకుమారిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వెలుగోడు: ఎన్నికల సమయంలో మండలానికి తహసీల్దార్‌గా నియమితులైన విజయకుమారి బుధవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు రెవెన్యూ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన విజయకుమారి ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించారని డిప్యూటీ తహసీల్దార్ నారాయణరెడ్డి కొనియాడారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాల పెంపునకే శిక్షసప్తాహ్



నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మిడుతూరు: విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంచేందుకు శిక్షసప్తాహ్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎస్‌ఓ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో మూడో రోజు కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఆటియా-పాటియా, భారతీయ సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



నల్లమలలో ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మహానంది : నల్లమల అడవిలో నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ కాలువ నుంచి ఫారం వెళ్లే మార్గంలో నాటుసారా బట్టీలను నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి శిరివెళ్ల మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని 400 లీటర్ల ఊటను ధ్వంసం చేయడంతో పాటు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నర్సాపురం ఎంపీడీఓ మృతి బాధాకరం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నరేష్

నందికొట్కూరు: ఏలూరు జిల్లా నర్సాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు మృతి బాధాకరమని నందికొట్కూరు ఎంపీడీఓ నరేష్ కృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు మానసిక స్థైర్యం కోల్పోకుండా ముందడుగు వేయాలని సూచించారు. ఈఓఆర్డీ సంజన్న, ఎంపీడీఓ కార్యాలయం ఉద్యోగులు, పీఎస్‌లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు హర్షణీయం

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం హర్షించదగ్గ విషయమని బీజేపీ జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం, పోలవరం పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం, రాయలసీమకు ప్రత్యేక కేటాయింపులు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

నందికొట్కూరు: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌లో సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అన్నా క్యాంటీన్ పనులను కమిషనర్ అనుపమతో కలిసి పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈ నాయబ్ రసూల్, కౌన్సిలర్లు రవూఫ్, చాంద్‌బాషా, లాలుప్రసాద్ తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారికి స్థల పరిశీలన

● భూ బాధితులతో మాట్లాడిన జేసీ విష్ణుచరణ్



జాతీయ రహదారి 340 సీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

పాములపాడు: జాతీయ రహదారి 340 సీతో భూములు కోల్పోతున్న ప్రాంతాలను జేసీ విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. అంతకు ముందు పాములపడు తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సమస్యాత్మకంగా ఉన్న నేషనల్‌హైవే 340 సీ నిర్మాణ భూములను పరిశీలించారు. పాములపాడు పొలిమేరలోని సర్వే నంబర్ 62లో 3.48 ఎకరాల స్థలాన్ని సేకరించారు. స్థల బాధితుడు శ్రీశారదా విద్యానికేతన్ హైస్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసరావు జేసీతో మాట్లాడుతూ.. అధికారులు చేసిన సబ్ డివిజన్ తప్పిదంతో స్కూలు క్రీడా మైదానం కోల్పోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. రెవెన్యూ అధికారులు, డీపీఆర్ ప్రకారం మొదట ఇచ్చిన అలైన్‌మెంటులో 38 సెంట్లు పోతుందని అని గుర్తించారన్నారు. మరికొంత కాలానికి రెండో దఫా ఇచ్చిన అలైన్‌మెంటులో 1.11 ఎకరాల స్థలాన్ని తీసుకుంటున్నట్లు చెప్పారని తెలిపారు. దీంతో కోర్టును ఆశ్రయించామని వివరించారు. హైవే నిర్మాణానికి తాను వ్యతిరేకిని కానని, 38 సెంట్ల స్థలాన్ని హైవే నిర్మాణానికి తీసుకుంటే తనకెలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంపై జేసీ తహసీల్దార్ వెంకటరమణ, సర్వేయర్ కలిముల్లాలతో చర్చించారు. మ్యాప్‌ను పరిశీలించారు.

పన్నుల చెల్లింపుతోనే దేశాభివృద్ధి

శ్రీశైలంప్రాజెక్ట్: దేశాభివృద్ధికి ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య అన్నారు. 165వ ఇన్‌కం ట్యాక్స్ డే సందర్భంగా బుధవారం కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలు చెల్లించిన పన్నులతో ప్రభుత్వం దేశాభివృద్ధికి వినియోగిస్తుందని, ఆదాయపు పన్ను, ఇతర పన్నులను సకాలంలో చెల్లించడం ప్రజల విధి అన్నారు. అధ్యాపకులు సుబ్రమణ్య శర్మ మాట్లాడుతూ 1860 జూలై24న జేమ్స్‌విల్సన్ ప్రపంచంలో మొట్టమొదటిగా ఇన్‌కంట్యాక్స్ విధానాన్ని తీసుకొచ్చారని చెప్పారు. 1961లో భారత ఆదాయపన్ను చట్టం తెచ్చి పన్నులను విధిస్తుందన్నారు.

నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర, నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, జి.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ మాటలే ఘనం... చేతలు శూన్యం అన్న చందంగా విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలు చేస్తారని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. ఈ బడ్జెట్ మధ్యతరగతి ప్రజల జీవితాన్ని మరింత కష్టతరం చేస్తుందని, మహిళలకు కేటాయింపులు పెరగ లేదన్నారు. విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైన రాజకీయ ఒత్తిడి తేవాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

పగిడ్యాల: కలెక్టర్ ఆదేశాల మేరకు రిలీవ్ అయి సొంత జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్ నాగేశ్వరరావును స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తహసీల్దార్‌కు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో వైఎస్సార్ జిల్లా నుంచి పగిడ్యాల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన నాగేశ్వరరావు తిరిగి సొంత జిల్లాకు వెళ్లడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణ సర్వ సాధారణమని.. విధుల్లో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు సంతృప్తినిస్తాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ కవిరాజు, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, డిప్యూటీ తహసీల్దార్ రవి, మురళీ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రాధిక, వీఆర్వోలు నాగన్న, భగవాన్‌దాస్, వెంకటస్వామి, నరసింహా, మద్దిలేటి, అంజలి, హేమలత పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు: రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రం-3లో సిబ్బందితో ఏడీఏ, ఏఓ పవన్ కుమార్ సమీక్ష నిర్వహించారు. సాగు చేసిన పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, పొలాలు కౌలు చేసుకునే రైతులకు కౌలు గుర్తింపు కార్డు ఇప్పించాలని చెప్పారు. ఏఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ట్రైకోడెర్మా వెరైటీ సూడోమోనాస్ వంటి బయో ఏజెంట్ల ద్వారా భూసారాన్ని పెంచి భూ ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు . భూసార పరీక్షల ద్వారా సిఫారసు మేరకు మాత్రమే రసాయనిక ఎరువులు వాడేలా రైతులను అవగాహన కల్పించాలన్నారు. ఏఈఓ సుధారాణి, వ్యవసాయ ఉద్యాన విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ, స్వర్ణ, నాగమణి పాల్గొన్నారు.

పత్తిలో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త రామక్రిష్ణారావు

మిడుతూరు: పత్తిసాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉమ్మడి జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామక్రిష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగలూటి, తలముడిపి, కడుమూరు గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం పత్తి సాగులో రసం పీల్చు పురుగులు (పచ్చదోమ, తామర పురుగులు) మెగ్నీషియం ధాతు లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి 25 పసుపు, 25 నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పత్తి సాగు చేసిన రైతులకు మందులను పంపిణీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్ ఉన్నారు.

బాల్య వివాహాలు భవిష్యత్తుకు ఆటంకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొత్తపల్లి: బాల్యవివాహాలు చేయడం బాలికల భవిష్యత్తుకు ఆటంకం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముసలిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు దాటేంత వరకు పెళ్లిళ్లు చేయకూడదన్నారు. బాల్యంలోనే పెళ్లిలు చేయడం వల్ల వారి మంచి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని తెలిపారు. బాలికలకు విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. బాలికలు, ఆడవారిపై ఎక్కువగా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌ఎం బ్రహ్మయ్య, మహిళా పోలీస్ వర జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సునీత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న లలిత ప్రభావతి

పాములపాడు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు సంభవిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి అన్నారు. బుధవారం మండలంలోని యర్రగుడూరు గ్రామంలో బాలసభ కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీయూపీ స్కూలులో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని సూచించారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. మహిళా సాధికారత, సామాజిక స్పృహ కలిగి ఉండాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సమ్మది, ఏఎన్‌ఎం ముర్తుజాబి, మహిళా పోలీసు శోభ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్

నందికొట్కూరు: బడ్జెట్ కేటాయింపుల్లో అంకెల గారడీ తప్పా పెద్దగా ప్రయోజనం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు, ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉందన్నారు. వ్యవసాయ పరిశోధనలన్నీ ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తామని చెప్పడం చూస్తే భవిష్యత్తులో రైతులపై భారం, ప్రజలకు ఆహార సంక్షోభం ఏర్పడక తప్పదన్నారు. 2030 నాటికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అమరావతికి రూ.15 వేల కోట్లు అప్పు ఇచ్చి, పోలవరం పూర్తి చేస్తామని, రాయలసీమను అభివృద్ధి చేస్తామని గారడీ మాటలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

విద్యుత్ వేళల్లో మార్పులు

వెలుగోడు: మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు బుధవారం నుంచి త్రీఫేస్ టైమింగ్స్‌లో మార్పులు చేసినట్లు ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 4 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు త్రీఫేస్ సరఫరా ఉంటుందని చెప్పారు. మొత్తంగా 9 గంటల పాటు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల: మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్‌ఐ తిమోతి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన పెద్దిచంద్రశేఖర్ పోరుమామిళ్ల పరిధిలోని బలిజకోటలో పందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక యువతి సరస్వతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. ఇటీవల మద్యానికి బానిసైన చంద్రశేఖర్ సంపాదనంతా.. అందుకే ఖర్చు చేస్తుండటంతో భార్య సరస్వతితో విభేదాలు తలెత్తాయి. రెండేళ్లుగా ఇంటికి దూరంగా ఉంటూ ఆత్మకూరులో బేల్దారి పనులు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంగసముద్రం సమీపంలో చెట్టుకు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. ఎస్‌ఐ మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్య చేసుకున్నట్లు స్పష్టం చేశారు.

ఎంపీడీఓ మృతి బాధాకరం

మహానంది: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు మృతి బాధాకరమని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వెంకట రమణారావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆత్మకూరులో శ్రీశైలం నియోజకవర్గ ఎంపీడీఓలు, ఎంపీపీ, మండల పరిషత్ సిబ్బంది ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ఈ సందర్భంగా రమణారావు సేవలను కొనియాడారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంఎస్ బాలికల హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదన్నారు. పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించి పాఠశాల గ్రాంట్స్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగంపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: ఈనెల 23న సాక్ష 'దినపత్రికలో' 'అక్రమ విద్యుత్ వినియోగం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జూపాడుబంగ్లా ట్రాన్స్‌కో ఏఈ స్పందించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న స్థావరాలపై దాడులు నిర్వహించి సర్వీసు వైర్లను స్వాధీనం చేసుకున్నారు. మండ్లెం విద్యుత్ ఉపకేంద్రానికి తరలించినట్లు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ.. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయిస్తామన్నారు. నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా అక్కడక్కడ కల్వర్టులు, వంతెనలు నిర్మిస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

'తల్లికి వందనం' అందజేయాలి

ఆత్మకూరు: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్‌చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓనం. 117ను రద్దు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన



సంప్రదాయ నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సూర్యకళా కల్చరల్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణేశ ప్రార్థన, మహిషాసురమర్దిని, శివతాండవం, శంభో శివశంభో తదితర గీతాలకు డి.వి.మోక్షిత, గణత్రయ, ప్రణతి, బ్రహ్మశ్రీ, జనని, కీర్తిక, ప్రణీత, గీతాశ్రీ, రచన, భవ్యశ్రీ, వాత్సల్య, లక్ష్మీనవ్యశ్రీ తదితరులు నృత్యం చేశారు.

సాక్షిగణపతి, జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు





ప్రత్యేక అలంకరణలో సాక్షిగణపతి, వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కళ్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకించి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

మహానందీశుడిని దర్శించుకున్న జేసీ



జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు ప్రసాదం అందజేస్తున్న పండితులు

మహానంది : మహానందీశుడిని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ బుధవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన జేసీకి ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇటీవల మహానందిలో సంచరిస్తున్న చిరుత వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన



వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీశైలం : క్షేత్ర పరిధిలోని మేకలబండ చెంచుగూడెం , మండల ప్రాథమిక పాఠశాల తదితర ప్రదేశాల్లో డయేరియాపై అవగాహన కల్పించడానికి రాష్ట్ర, కేంద్రాలకు సంబంధించిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బుధవారం శ్రీశైలం చేరుకుంది. సెంట్రల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు విశాల్ కటారియా, రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయకుమార్ బృందంతో కలిసి పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటగా డయేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం మేకలబండ చెంచుగూడెం లోనున్న గృహాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి డయేరియా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. 0-5 సంవత్సరాలు కలిగిన పిల్లలందరికీ ప్రభుత్వం తరఫున ఉచితంగా రెండు ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు డయేరియాపై అవగాహన కల్పించి వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా ప్రోగ్రాం ఉంటుందని చెప్పారు. జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు షహనాజ్, బొజ్జిరెడ్డి, శ్రీవాణి, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

నిస్వార్థంగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు



తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జూపాడుబంగ్లా: అధికారులు నిస్వార్థంగా విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న అన్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా గుడిపాడు మండలం నుంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో బాబూరాజేంద్రప్రసాద్ జూపాడుబంగ్లాకు వచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారిని కలెక్టర్ రాజకుమారి రిలీవ్ చేయడంతో ఆయన సొంత జిల్లా చిత్తూరుకు బదిలీ అయ్యారు. బుధవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సత్కరించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, మండల సర్వేయర్ షహనా పర్వీన్, లైసెన్స్‌డు సర్వేయర్ సుమిత్ర, సీనియర్ అసిస్టెంట్ సరళ, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతున్న బాలికలు

నందికొట్కూరు: క్రీడలు విద్యార్థుల మానసిక ఆనందానికి శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని హెచ్‌ఎం సలీంబాషా అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట)లో స్పోర్ట్స్ డే నిర్వహించారు. విద్యార్థులకు వినోదాత్మకంగా తొక్కుడు బిళ్ల, ఉప్పుమూట, గట్టులోపల గట్టు బయట, మ్యూజికల్ చైర్స్, బాల్ స్కిప్పింగ్ వంటి మైనర్ గేమ్స్‌ను నిర్వహించారు. ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొన్ని విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు స్పోర్ట్స్ డే నిర్వహించామని తెలిపారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీరం ఫిట్‌గా ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శాలమ్మ, అరుణా, విజయభారతి, లలితమ్మ, సరోజినీదేవి, ఫంశాద్ బేగం, వెంకటేశ్వర్లు, రామిరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న సేవలో గోషామహల్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజాసింగ్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్రం గోషామహల్ ఎమ్మెల్యే టీ.రాజా సింగ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఏఈఓ హరిదాసు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.